క్లుప్తంగా

సుబ్రహ్మణ్య స్వామికి విశేష అభిషేకాలు


సుబ్రహ్మణ్యస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెం లోని ఉమాచంద్ర మౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువైన వల్లీదేవ సేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం అభిషేకాలు, పూజలు విశేషంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలు నిర్వహించారు.

జగనన్న సురక్షపై అవగాహన సదస్సు నేడు

పరవాడ: వెన్నలపాలెం కల్యాణ మండపంలో బుధవారం 10 గంటలకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వి.హేమసుందర్రావు చెప్పారు. ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ చేరుతున్నాయా లేదా అన్న విషయాలపై ఈ నెల 24 నుంచి గ్రామ స్థాయిలో జగనన్న సురక్ష సర్వే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సర్వేపై వలంటీర్లకు అవగాహన కల్పించడానికి ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమానికి జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు, వైస్ ఎంపీపీలు బి.నాగేశ్వరరావు, బి.అప్పలరాజు, అధికారులు పాల్గొంటున్నారని తెలిపారు.

రేపు మండల పరిషత్ సమావేశం

సింహాచలం: పెందుర్తి మండల పరిషత్ సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10.30గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలని ఆయన కోరారు.

సబ్బవరం ఎంఈవో-2 బాధ్యతల స్వీకరణ


ఎంఈవో-2గా బాధ్యతలు స్వీకరిస్తున్న బోళం సూర్యనారాయణ

సబ్బవరం: సబ్బవరం మండల విద్యాశాఖాధికారి-2గా బోళం సూర్యనారాయణమూర్తి మండల విద్యావనరుల కేంద్రంలో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటివరకూ కె. కోటపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి-1 ఎస్. అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు. ఆయన్ను పీఆర్టీయూ సబ్బవరం మండల శాఖ ఆధ్వర్యంలో డి. శ్రీనివాసరావు అధ్యక్షతన సన్మానించారు.

శ్రీదేవికి ఉత్తమ దర్శకురాలి అవార్డు


ఉత్తమ మహిళా దర్శకురాలు అవార్డు అందుకుంటున్న మెరుగుమాల శ్రీదేవి

సబ్బవరం: వీకేఆర్ ఎంటర్ టైన్‌మెంట్స్, 24 ఫ్రేమ్స్ సంయుక్తంగా శనివారం హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో వీకేఆర్ ఎంటర్ టైన్‌మెంట్స్ షార్ట్ ఫిల్మ్ అవార్డులు అందజేశారు. దీనిలో విశాఖకు చెందిన మెరుగుమాల శ్రీదేవికి ఉత్తమ మహిళా దర్శకురాలి అవార్డు లభించింది. అలాగే అతికిన బ్రతుకులు చిత్ర కథానాయకుడు ఆరిపాక ప్రసాదరావు కూడా అవార్డు అందుకున్నారు.

ట్యాంకర్ ఢీకొని యువకుడి మృతి

పెదగంట్యాడ: గంగవరం పోర్టు వంతెనపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాలు..మండలంలోని దాసరి వీధి లో నివాసం ఉంటున్న దాసరి క్రాంతికుమార్ (22) సోమవారం రాత్రి 8.15 గంటల సమయంలో ద్విచక్రవాహనంపై పెట్రోల్ బంక్‌కు వెళ్తుండగా, వెనుక నుంచి వచ్చిన ట్యాంకర్ ఢీకొట్టింది. దీంతో ఆ యువకుడు రోడ్డుపై పడిపోయాడు. 108 సిబ్బంది యువకుడిని చికిత్స నిమిత్తం కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 10.30 గంటల సమయంలో మృతి చెందాడు.

అందరి సంక్షేమానికే 'జగనన్న సురక్ష'

- డీఎల్‌డీవో మంజులావాణి
- 24 నుంచి ఇంటింటి సర్వే


శిక్షణ కార్యక్రమానికి హాజరైన సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు

సబ్బవరం: సాంకేతిక కారణాలతో ప్రభుత్వ పథకాలకు నోచుకోని వారికి కూడా పథకాలు అందించేందుకు కల్పించిన మరో అవకాశమే జగనన్న సురక్ష అని డీఎల్‌డీవో మంజులావాణి చెప్పారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సచివాలయ సిబ్బందితో పాటు గ్రామ వలంటీర్లకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీన్ని ఎంపీపీ బోకం సూర్యకుమారి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావుతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంజులావాణి మాట్లాడుతూ వలంటీర్లంతా తమ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి వారి సమస్యలను నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంతో పాటువిధి నిర్వహణలో వలంటీర్లు,సచివాలయ సిబ్బంది అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. అవసరమైతే విధుల నుంచి తొలగిస్తామని ఆమె హెచ్చరించారు. ఈ నెల 24 తేదీ నుంచి వలంటీర్లంతా ఇంటింటికీ వెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రజల సమస్యలను నమోదు చేసుకుంటారని తెలిపారు. అనర్హులు ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవడానికి వచ్చినప్పుడు వారికి సైతం సహనంతో విధివిధానాలపై అవగాహన కల్పించాలని సూచించారు. సచివాలయ సిబ్బంది,వలంటీర్లు ప్రభుత్వ విధానాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి అర్హులందరికీ ప్రభుత్వ సేవలు అందే విధంగా కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్ నాయుడు,తహసీల్దార్ బి. సత్యనారాయణ, సచివాలయాల మండల కన్వీనర్ సబ్బవరపు నారాయణమూర్తి,ఈవోఆర్‌డీ మహేష్, డిప్యూటీ తహసీల్దార్ వెంకట్, ఏఎల్‌వో హేమంత్ తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎల్‌డీవో మంజులా వాణి

తానాం గురుకుల విద్యార్థులకు రాష్ట్రస్థాయి పురస్కారాలు


సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా చెక్కు అందుకుంటున్న విద్యార్థి వీక్షిత

పరవాడ: తానాం మహాత్మా జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల కళాశాల, పాఠశాల విద్యార్థులు ఇంటర్, పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి పురస్కారాలకు ఎంపికయ్యారు. ఈ మేరకు విజయవాడలో మంగళవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో ముఖ్యమంత్రి వై ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్నారు. ఇంటర్‌లో 976/1000 మార్కులు సాధించిన వి.భాగ్యశ్రీకి సీఎం వైఎస్ జగన్ రూ.లక్ష నగదు చెక్కు, మెడల్, మెరిట్‌సర్టిఫికెట్ బహూకరించారు. అలాగే గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థి రొంగలి వీక్షితను సీఎం ప్రత్యేకంగా అభినందించి రూ.75 వేల నగదు చెక్కు, మెడల్, మెరిట్ సర్టిఫికెట్ అందజేశారని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అప్పలనాయుడు చెప్పారు. విద్యార్థుల ఉన్నతికి కృషి చేసిన కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అప్పలనాయుడును సీఎం అభినందించి మెమెంటో బహూకరించారు. కార్యక్రమంలో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, విద్యా శాఖ అధికారులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌ల ఫిట్‌నెస్ పరిశీలన

మహారాణిపేట: రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని 108 అంబులెన్స్‌లను అధికారులు మంగళవారం పరిశీలించారు. అంబులెన్స్ పనితీరు, డ్రైవర్ల లైసెన్సులు, వాహనాల ఫిట్‌నెస్ తదితర అంశాలను పరిశీలించి డ్రైవర్లకు పలు సూచనలు చేశారు.సంఘటన స్థలానికి 15 నిమిషాల్లో చేరుకునేందుకు డ్రైవర్లకు సూచనలు అందజేసి, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ముత్యాలమ్మా.. చల్లగ చూడమ్మా


ప్రత్యేక అలంకరణలో ముత్యమాంబ

పరవాడ: ముత్యాలమ్మపాలెం గ్రామంలో కొలువుదీరిన ముత్యమాంబ అమ్మవారి కంబాల పండగను మంగళవారం గంగపుత్రులు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ముత్యమాంబను దర్శించుకొని పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కంబాల పండగను పురస్కరించుకొని సతకం పట్టులో ఏర్పాటు చేసిన కంబాలను కొట్టడడంతో పండగ పూర్తి అయినట్లు గంగపుత్రులు విశ్వసిస్తారు. పండగకు విశాఖ, అనకాపల్లి పట్టణ ప్రాంతాలు నుంచే కాకుండా ముత్యాలమ్మపాలెం పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. భారీ బాణ సంచాకాల్పులు, బాజా భజంత్రీల నడుమ కంబాల పండగను అంగరంగ వైభవంగా చేశారు. పండగలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పరవాడ సీఐ పి.ఈశ్వరరావు గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

మర్యాద పూర్వక కలయిక


సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న అజయ్‌రాజ్

సింహాచలం: టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డిని మంగళవారం విశాఖ విమానాశ్రయంలో పెందుర్తి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ అన్నంరెడ్డి అజయ్‌రాజ్ మర్యాద పూర్వకంగా కలిశారు. సుబ్బారెడ్డిని దుశ్శాలువాతో సత్కరించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన


లక్ష్మీనగర్‌లో అవగాహన కల్పిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

గోపాలపట్నం: స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా ఇందిరానగర్‌లో మంగళవారం సీజనల్ వ్యాధులపై పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జోన్ కమిషనర్ మల్లయ్య నాయుడు పలు ప్రాంతాల్లో పర్యటించారు. పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని కార్మికులను హెచ్చరించారు. ఖాళీ స్థలాలు, ప్రభుత్వ స్థలాల్లో వ్యర్థాలు వేస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని శానిటరీ సిబ్బంది అధికారులతో పాటు సచివాలయ కార్యదర్శులకు సూచించారు. అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తడి, పొడి, ప్రమాదకర చెత్తలను వేర్వేరుగా అందివ్వాలని సూచించారు. వీటిని వినియోగించి విద్యుత్ ఉత్పత్తి చేస్తామన్నారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మంచినీరు నిల్వ లేకుండా ప్రతీ శుక్రవారం శుభ్రం చేసుకుని పాత్రల్ని ఎండలో ఉంచాలని సూచించారు. నిషేధిత ప్లాస్టిక్ సంచులు వాడితే ఫైన్లు భరించాల్సి వస్తుందని హెచ్చరించారు. దుకాణదారులు అమ్మినా, వినియోగదారులు వాడినా జీవీఎంసీ అధికారులు కఠినంగా వ్యవహరిస్తారన్నారు. యూజర్ చార్జీలు అందరూ చెల్లించి జీవీఎంసీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఘనంగా నిత్యకల్యాణం


పాల్గొన్న ఉభయదాతలు


తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు ప్రసాదం, అక్షింతలు, శేషవస్త్రాలు అందజేశారు.

స్టీల్‌ప్లాంట్ కార్మికుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న సీజీఎం, కార్మిక నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం సందడిగా జరిగింది. 1993 సంవత్సరం బ్యాచ్ కార్మికులు 30 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా సెక్టార్-1 స్టీల్‌క్లబ్‌లో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్-1 సీజీఎం పి. శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ అభివృద్ధిలో ఉక్కు కార్మికుల పాత్ర ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, అయోధ్యరామ్, కె.ఎస్.ఎన్. రావు, నీరుకొండ రామచంద్రరావు పాల్గొని కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్‌లో చోరీ


ఇంట్లో తెరిచి ఉన్న బీరువా, చిందరవందరగా దుస్తులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సెక్టార్-3లోని క్వార్టర్స్‌లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. బంగారు, వెండి వస్తువులు అపహరణకు గురయ్యాయి. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలివి.. స్టీల్‌ప్లాంట్‌లో సీనియర్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న జమ్మాన మోహన్‌కుమార్ సోమవారం రాత్రి షిఫ్ట్‌కు విధులకు వెళ్తూ, భార్య, పిల్లలను ఇంట్లో ఉంచి బయట తాళం వేశారు. భార్య ప్రమీల పిల్లలతో బెడ్ రూమ్‌లో పడుకుని గడియ వేసుకున్నారు. తెల్లవారుజామున రెండున్నర గంటల సమయంలో ఇంట్లోకి ఇద్దరు వ్యక్తులు ప్రవేశించారు. ఆ శబ్దం విని బయటకు వచ్చిన ప్రమీల రెండో బెడ్‌రూమ్ బయట ఇద్దరు వ్యక్తులను గమనించారు. వారు ఆమెను చూసి పట్టుకునేందుకు ప్రయత్నించగా, వెంటనే ఆమె బెడ్‌రూమ్‌లోకి వెళ్లి గడియ వేసుకున్నారు. ఆమె తన భర్తకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వడంతో, వెంటనే ఆయన ఇంటికి చేరుకున్నారు. అప్పటికే బయట తలుపు విరగ్గొట్టి ఉండటం గమనించిన మోహన్‌కుమార్ ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలు తెరిచి, అందులో బట్టలు కింద వేసి ఉన్నాయి. బీరువాలో వస్తువులను తనిఖీ చేయగా నల్లపూసల దండ, లాకెట్‌తో కూడిన చెయిన్, ఐదు చిన్న ఉంగరాలు, రెండు జతల చెవి రింగులు వెరసి నాలుగు తులాల బంగారం, 10 తులాల వెండి వస్తువులతో పాటు రూ.8500 నగదుతో మొత్తం రూ. 1,13,500 అపహరణకు గురైనట్టు గుర్తించారు. బాధితుల ఫిర్యాదుతో స్టీల్‌ప్లాంట్ క్రైం ఎస్‌ఐ ఎల్. శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐక్య పోరాటాలతో 'ఉక్కు' పరిరక్షణ


859వ రోజు దీక్షలో పాల్గొన్న ఉక్కు పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కార్మికులు చేస్తున్న ఉద్యమానికి కేంద్రప్రభుత్వం దిగివచ్చి, విశాఖ ఉక్కు కర్మాగార అమ్మకపు ప్రతిపాదనను వెనక్కి తీసుకోక తప్పదని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 859వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగ కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలను కార్మికులంతా ఐక్యంగా ఎదుర్కొంటామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన ఆర్టీసీ బస్

ద్విచక్ర వాహనం, రక్షణ గోడ ధ్వంసం


షిప్‌యార్డ్ కాలనీ రక్షణ గోడను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

మల్కాపురం: ఆర్టీసీ బస్ అదుపు తప్పి.. సేవా మార్గంలోని రక్షణ గోడను ఢీకొట్టింది. బస్‌లో ప్రయాణికులు లేకపోవడం, రక్షణ గోడ వద్ద జన సంచారం లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ఈ ఘటనలో నేవీ ఉద్యోగికి చెందిన బైక్ దెబ్బతింది. వివరాలివీ.. గాజువాక డిపోకు చెందిన 55కే బస్ మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో కొత్తవలస నుంచి సింధియా వైపు వస్తోంది. మార్గమధ్యలో షిప్‌యార్డ్ కమర్షియల్ కాంప్లెక్స్ దగ్గరకు రాగానే బస్ ముందు చక్రానికి మధ్య గల హైడ్రోలిక్ బ్రేక్ పైపు డివైడర్‌కు రాసుకుంది. ఈ క్రమంలో డివైడర్‌లో పైపు చిక్కుకుపోవడంతో ఆందోళనకు గురైన డ్రైవర్ వేగాన్ని పెంచాడు. దీంతో బస్ అదుపు తప్పింది. గత్యంతరం లేని పరిస్థితిలో బస్ డ్రైవర్ కమర్షియల్ కాంప్లెక్స్ పక్కన గల షిప్‌యార్డ్ ఉద్యోగుల కాలనీ రక్షణ గోడను ఢీ కొట్టాడు. అక్కడకు సమీపంలో ఫుట్‌పాత్‌పై కొంత మంది పండ్లు, కూరగాయల వ్యాపారం చేస్తున్నారు. బస్ తమ మీదకు వస్తుందేమోనని భయపడి.. వ్యాపారులు అక్కడ నుంచి తప్పు కున్నారు. కాగా.. ఓ నేవీ ఉద్యోగి కొబ్బరి బొండం తాగేందుకు తన వాహనాన్ని పండ్ల దుకాణం వద్ద నిలిపాడు. అతని వాహనాన్ని బస్ బలంగా ఢీకొనడంతో దెబ్బతింది. సమాచారం అందుకున్న మల్కాపురం పోలీసులు అక్కడకు చేరుకుని.. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. పొక్లెయిన్ సాయంతో బస్‌ను బయటకు తీశారు. గాజువాక ఆర్టీసీ డిపో అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు.

పతకాలు సాధించిన క్రీడాకారులకు వీసీ అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

విశాఖ స్పోర్ట్స్: ఖేలో ఇండియా పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులన ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి అభినందించారు. గౌతమబుద్ధ విశ్వవిద్యాలయంలో జూన్ 3వ తేదీతో ముగిసిన ఖేలో ఇండియా విశ్వవిద్యాలయాల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 64 కేజీల వెయిట్ కాటగిరీలో ఎస్.పల్లవి స్వర్ణాన్ని సాధించింది. 87 కేజీల్లో టి.సత్యజ్యోతి రజతాన్ని సాధించగా... 45 కేజీల విభాగంలో బి.రాజేశ్వరి, 89 కేజీల వెయిట్‌లో ఎం.మణికంఠ కాంస్యాలు అందుకున్నారు. ఏయూ తరుపున పాల్గొన్న వీరందరినీ వీసీతో పాటు రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్ అభినందించారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ పతకాలు సాధించిన క్రీడాకారులకు నగదు ప్రోత్సాహాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూపీఈ విభాగ సంచాలకుడు విజయ్‌మోహన్, హెడ్ ఎ.పల్లవి తదితరులు పాల్గొన్నారు.

మూడు స్కూల్ బస్సులపై కేసులు


స్కూల్ బస్సును తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

గోపాలపట్నం: రవాణా శాఖ అధికారులు చేపట్టిన తనిఖీల్లో ఫిట్‌నెస్ లేని మూడు స్కూల్ బస్సులపై కేసులు నమోదు చేశారు. మంగళవారం ఎన్ఏడీ, మద్దిలపాలెం, బో యపాలెం, గాజువాక, షీలానగర్, బీచ్ రోడ్డు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఇప్పటి వరకు ఏడు బస్సులపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీలు ఈ నెల 30 వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. మోటార్ వాహన తనిఖీ అధికారులు బుచ్చిరాజు, గణేష్ రెడ్డి, బాలాజీరావు, హరి ప్రసాద్, మన్మోహన్, శ్రీనివాస్ యాదవ్, పి.శిరీష, సత్యం నాయుడు, సృజన, మాధవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథుడి రథయాత్ర

జగన్నాథుడి రథచక్రాలు కదిలాయి. ఆషాడ శుద్ధ విదియ సందర్భంగా మంగళవారం తొలి రథయాత్రను వైభవంగా నిర్వహించారు. బలభద్ర, సుభద్ర సమేతుడైన స్వామి నేత్రపర్వంగా దర్శనమిచ్చారు. స్టీల్‌ప్లాంట్, అగనంపూడి, పెదగంట్యాడ హెచ్‌బీ కాలనీ తదితర ప్రాంతాలు రథయాత్రతో శోభాయమానంగా దర్శనమిచ్చాయి.

- స్టీల్‌ప్లాంట్, అగనంపూడి, హెచ్‌బి కాలనీల్లో సందడి
- బంగారు చీపురుతో రథాన్ని శుభ్రం చేసిన స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్


బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథస్వామి


స్టీల్‌ప్లాంట్‌లో జగన్నాథుడి రథాన్ని, బంగారు చీపురుతో ఊడుస్తున్న స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ మహంతి


ఉక్కునగరం రథయాత్రలో మహిళల కోలాటం

ఉక్కునగరం: జగన్నాథుని రథయాత్ర ఉక్కునగరంలో మంగళవారం వైభవంగా జరిగింది. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ముందుగా స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (కమర్షియల్) డి.కె. మహంతి దంపతులు జగన్నాథునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుని ఉత్సవ విగ్రహాలను రథం పై కొలువుదీర్చారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మహంతి సంప్రదాయ దుస్తుల్లో బంగారు చీపురుతో రథాన్ని శుభ్రం చేశారు. పెద్ద ఎత్తున హాజరైన భక్తుల జయ జయధ్వానాల మధ్య రథం ఉక్కునగరంలోని పలు సెక్టార్ల మీదుగా సెక్టార్-8లోని ఇంద్రద్యుమ్న హాలుకు చేరుకుంది. రథయాత్రలో భజనలు, కోలాటాలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఉన్నతాధికారులతో పాటు ఉత్కళ్ కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

కదిలిన జగన్నాథ రథచక్రాలు

అగనంపూడి: అగనంపూడిలో వేంచేసియున్న జగన్నాథస్వామి రథయాత్ర కనులపండువగా జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే తొలిపూజ చేసిన అనంతరం రథయాత్ర ఆలయం నుంచి ఇంద్రద్యుమ్న హాలు వరకు సాగింది. ఆలయ వ్యవస్థాపకులు, పండా కుటుంబీలు రథాన్ని లాగడంతో కార్యక్రమం ప్రారంభమైంది. భక్తులు పోటీ పడి రథాన్ని లాగారు.

హెచ్‌బీ కాలనీలో..

పెదగంట్యాడ: హౌసింగ్ బోర్డు కాలనీలోని జగన్నాథస్వామి ఆలయంలో రథయాత్రను కనులపండువగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు రథం లాగారు. ఆలయ ప్రధాన అర్చకుడు ప్రమోద్ సారంగి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు.

గౌరీ సేవాసంఘం ఆధ్వర్యంలో..

అక్కిరెడ్డిపాలెం: గాజువాకకు చెందిన శ్రీ గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో రథయాత్రను ఘనంగా నిర్వహించారు. రథయాత్రను మంగళవారం సాయంత్రం బెల్ సిగ్నల్ పాయింట్ వద్ద ప్రసన్న వేంకటేశ్వరాలయం నుంచి రథయాత్ర ప్రారంభమైంది. ఆలయ కమిటీ చైర్మన్ గంద్రెడ్డి రాముునాయుడు పూజలు నిర్వహించి ప్రారంభించారు.

కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేయాలని వినతి


వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు

సబ్బవరం: ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లందరినీ రెగ్యులర్ చేయాలని మండలంలోని ప్రభుత్వ జూనియర్,డిగ్రీ కళాశాల,పాలిటెక్నిక్ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు డిమాండ్ చేశారు. జేఏసీ కార్యాచరణలో భాగంగా సబ్బవరంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు మూడు రోడ్ల కూడలిలోని డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి మంగళవారం నివాళులర్పించి వినతిపత్రం అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తమ గోడును ఆలకించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పి. వరప్రసాద్, ఎల్‌వీరమణ బాబు,కె. విజయ,నీలిమ తదితరులు ఉన్నారు.